పారిశుధ్య కార్మికుల సమ్మె సైరన్

- పీఆర్సీ ఏరియర్స్ కోసం రేపటి నుంచి ఆందోళన బాట
- నాలుగు నెలల బకాయిలు పెండింగ్
- ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు

కార్పొరేషన్, ఏప్రిల్ 8: కరీంనగర్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మెబాట పడుతున్నారు. నాలుగు నెలలకు సంబంధించిన పీఆర్సీ ఏరియర్స్ చెల్లించకపోవడం, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సమ్మెకు సంబంధించిన నోటీసులను నగర కమిషనర్‌కు అందించగా, బుధవారం నుంచే నిరసనకు దిగుతున్నారు. వివరాల్లోకి వెళితే.. 2021 ఏప్రిల్‌లో అప్పటి సీఎం కేసీఆర్ పారిశుధ్య కార్మికులకు 30 శాతం పీఆర్సీ ప్రకటించారు. అదే సంవత్సరం జూన్ నుంచి అమలు చేశారు. జూన్ నుంచి డిసెంబర్ వరకు ఏరియర్స్ రావాల్సి ఉండగా కరీంనగర్ నగరపాలక అధికారులు ఇప్పటివరకు కేవలం జూన్, జూలైకు సంబంధించిన బకాయిలు మాత్రమే చెల్లించారు. మిగిలిన నాలుగు నెలల ఏరియర్స్ ఇవ్వలేదు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఇచ్చినా కరీంనగర్‌లో మాత్రం కొందరికి పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో 1065 మంది కార్మికులు పని చేస్తుండగా, ఇందులో 800 మందికి పైగా పీఆర్సీ ఏరియర్స్ రాలేదు. అయితే అధికారులను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని, ఈ క్రమంలోనే సమ్మెలోకి వెళ్తున్నామని కార్మికులు చెబుతున్నారు.

నాలుగు నెలల పరియర్స్ పెండింగ్: బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఈ నెల 10 నుంచి మొదలయ్యే సమ్మెకు పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరుకావాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆరు నెలలకు సంబంధించిన ఏరియర్స్‌లో కేవలం రెండు నెలల ఏరియర్స్ మాత్రమే చెల్లించారని, నాలుగు నెలలు పెండింగ్‌లోనే పెట్టారన్నారు. ఒక్కో కార్మికుడికి సుమారుగా రూ.15 వేల మేర రావాల్సి ఉందన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో చెల్లించారని, కరీంనగర్‌లోనే పెండింగ్‌లో పెట్టారని చెప్పారు. ఈ విషయమై పలుమార్లు నగర కమిషనర్‌ను కలిసి విన్నవించినా పట్టించుకోలేదని, ఈ క్రమంలోనే బుధవారం నుంచి సమ్మెలోకి దిగుతున్నామని, నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామని వివరించారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- నగరంలో మంచినీటి పంపింగ్ వ్యవస్థ పరిశీలన

కార్పొరేషన్, ఏప్రిల్ 8: కరీంనగరంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం నగరంలోని ఉజ్వల పార్క్ సమీపంలో మంచినీటి పంపింగ్ వ్యవస్థ, కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులను తాగునీటికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగరంలో తాగునీటి ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా..? ఎప్పుడెప్పుడు నీటిని సరఫరా చేస్తున్నారు? ఎంత పరిమాణంలో ఇస్తున్నారు? ఎల్ఎండీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఎన్ని టీఎంసీల నీరు ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, నగరంలో తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు అధికారులు అదనంగా ఒక మోటర్‌ను ఏర్పాటు చేస్తున్నారని, ఇందుకోసం కొత్తగా ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఎలాంటి ఆటంకం లేకుండా తాగునీటిని సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ పట్టణంలో కొద్ది నెలల వరకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, మున్సిపల్ ఈఈ బీ మహేందర్, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ గట్టు స్వామి తదితరులు పాల్గొన్నారు.

◀ఉజ్వల పార్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

పార్క్ నిర్వహణపై నిర్లక్ష్యం వీడాలి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 8 : పార్క్ నిర్వహణపై నిర్లక్ష్యాన్ని వీడాలని, పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి పర్యాటక శాఖ సిబ్బందిని ఆదేశించారు. కరీంనగర్‌లోని ఉజ్వల పార్క్‌ను సోమవారం సాయంత్రం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్‌లో కలియ తిరిగారు. ఉజ్వల పార్క్ నిర్వహణ తీరు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పార్క్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని రకాల మొక్కలు, గార్డెన్ సంరక్షణకు కృషి చేయాలని చెప్పారు. ఎప్పటికప్పుడు ఫౌంటేయిన్ల వద్ద పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. పార్క్‌లో ఉన్న జగన్నాథ స్వామి ఆలయాన్ని కలెక్టర్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, పర్యాటక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి చేరిన సైకిల్ యాత్ర

కలెక్టరేట్, ఏప్రిల్ 8: ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకమైన ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ కేంద్రానికి మధ్యాహ్నం చేరుకోగా, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ స్వాగతం పలికారు. సైకిల్ యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజు కొనసాగిస్తున్న యాత్ర జిల్లాలోని ఓటర్లందరికీ స్ఫూర్తిదాయకంగా నిలువాలని ఆకాంక్షించారు. ఓటు హక్కు సద్వినియోగం చేసుకుంటే, దేశభవిష్యత్తుకు పాటుపడిన వారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి

గంగాధర, ఏప్రిల్ 8 : సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో యువత ముందుండాలని ఎంపీడీవో దమ్మని రాము పిలుపునిచ్చారు. లిబర్టీ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి. మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడ్లపెల్లి గంగాధర్, సంఘం అధ్యక్షుడు గంగాధర ప్రవీణ్, సభ్యులు చంద్రమోహన్, మధు, మహేందర్, ప్రణయ్, రాజు, సృజన్, రవీందర్, రఘు, రాకేశ్, ప్రణీత్, అభినవ్, అభిషేక్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తెలంగాణచౌక్/రాంనగర్, ఏప్రిల్ 8: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నగర ఏసీపీ నరేందర్ తెలిపారు. కరీంనగర్ ఆటో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన నగర ఆటో డ్రైవర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నమ్మకం, నిజాయతీలో ఆటో డ్రైవర్లు ప్రయాణికుల మన్ననలను పొందాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లేకుండా వాహనాలను నడపకూడదని, పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సరిలాల్, ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు రాజేందర్, నాయకులు ఆంజనేయులు, తిరుపతి, సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌కు ఓటేసి గెలిపించండి

- ఉపాధి హామీ కార్మికులతో వినోద్‌కుమార్ సతీమణి మాధవి

ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వినోద్‌కుమార్ సతీమణి మాధవి

కొత్తపల్లి, ఏప్రిల్ 8 : కార్మికుల కష్టాలతో పాటు పలు సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉన్న బోయినపల్లి వినోద్‌కుమార్‌ను రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన సతీమణి మాధవి విజ్ఞప్తి చేశారు. సోమవారం శాతవాహన యూనివర్సిటీలో పనిచేస్తున్న చింతకుంట, మల్కాపూర్ గ్రామాలకు చెందిన ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2014 నుంచి 2019 వరకు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన వినోద్‌కుమార్ కరీంనగర్ అభివృద్ధికి చేసిన కృషిని వారికి వివరించారు. కరీంనగర్ మరింత అభివృద్ధి చెందాలంటే కేవలం వినోద్‌కుమార్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను వినోద్‌కుమార్ సతీమణికి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్, బీఆర్ఎస్ నాయకులు సంబోజు లతామల్లేశం, రాము, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశ ప్రగతి

- మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్

మాట్లాడుతున్న వొడితల సతీశ్‌కుమార్

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 8: విద్యతోనే దేశ ప్రగతి సాధ్యమని హుస్నాబాద్ మాజీ శాసన సభ్యుడు, కిట్స్ కళాశాల సెక్రటరీ వొడితల సతీశ్ కుమార్ పేర్కొన్నారు. సింగాపూర్ కిట్స్ కళాశాలకు గల నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్‌ను మరో మూడేండ్లు పొడిగించిన సందర్భంగా సోమవారం కళాశాల సమావేశ మందిరంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే శంకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సతీశ్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువచేసే ముఖ్య ఉద్దేశంతో కిట్స్ కళాశాలను 1997లో ప్రారంభించామన్నారు. కళాశాలలోని ఈఈఈ, ఈసీఈ, సీఎస్‌సీ విభాగాలు 2021లో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ పొందినట్లు తెలిపారు. 2023లో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ నుంచి ఏ ప్లస్‌ప్లస్ గుర్తింపు పొందిందని, గతేడాది యూజీసీ స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా ఇచ్చిందని గుర్తు చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ, నియమ నిబంధనల ప్రకారం కళాశాలలో ప్రయోగశాలలు, లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీ, స్పోర్ట్స్ కాంప్లెక్స్ మొదలైన అన్ని వసతులు ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఈశ్వరయ్య, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఎస్జీఎఫ్ కార్యదర్శిగా వేణుగోపాల్

వేణుగోపాల్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డీఈవో

కొత్తపల్లి, ఏప్రిల్ 8 : పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) జిల్లా కార్యదర్శిగా బీ వేణుగోపాల్ నియమితులయ్యారు. మంకమ్మతోటలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పీడీగా విధులు నిర్వహిస్తున్న ఆయనను సీనియారిటీ మేరకు ఎస్జీఎఫ్ కార్యదర్శిగా నియమిస్తూ డీఈవో వీ జనార్దన్‌రావు ఉత్తర్వులను సోమవారం అందించారు. నూతనంగా ఎస్జీఎఫ్ కార్యదర్శిగా ఎన్నికైన వేణుగోపాల్‌ను వ్యాయామ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ(పెటా టీఎస్), తెలంగాణ ఉపాధ్యాయ సంఘం (టీజీ పెటా), తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ (టీ పీయూఎస్) ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అంతడుపుల శ్రీనివాస్, కే సమ్మయ్య, కే కృష్ణ, ఆర్ నర్సయ్య, సొల్లు సారయ్య, ఏ శంకరయ్య, బన్సీలాల్, శీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ వద్ద జమ్మికుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇప్పలపల్లి రవీందర్ (42) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామానికి చెందిన ఇప్పలపల్లి రవీందర్ ద్విచక్రవాహనంపై హుజూరాబాద్ నుంచి జమ్మికుంట వైపు వెళ్తుండగా, అదే సమయంలో ఇందిరానగర్ సమీపంలో డివైడర్ వద్ద మరో ద్విచక్ర వాహన దారుడు యూటర్న్ తీసుకుంటుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రవీందర్ తలకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స కోసం హుజూరాబాద్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు ఉన్నారు. మరో ద్విచక్రవాహనదారుడికి స్వల్ప గాయాలు కాగా, జమ్మికుంట దవాఖానలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

దొంగ అరెస్ట్

రాంనగర్, ఏప్రిల్ 8: నగరంలోని కట్ట రాంపూర్ ప్రాంతంలో ఈనెల 4న జరిగిన చోరీ ఘటనలో నిందితున్ని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కట్టరాంపూర్‌కు చెందిన రావుల మారయ్య ఈ నెల 4న ఇంటికి తాళం వేసి పని మీద వెళ్లగా గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాలో భద్రపరిచిన రూ.లక్ష నగదు, వెండి, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లారు. మారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇన్స్పెక్టర్ సరిలాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఎస్ఐ స్వామి, హెడ్ కానిస్టేబుల్ హసన్, సిబ్బంది బషీర్‌ఖాన్, కుమారస్వామి నిందితుని కోసం గాలిస్తుండగా సోమవారం పట్టుబడ్డాడు. నిందితుడు కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన తోట మహేశ్‌గా గుర్తించారు. ప్రస్తుతం స్థానికంగానే కట్టరాంపూర్‌లోనే ఉంటూ నేరానికి పాల్పడినట్లు గుర్తించి అతడి నుంచి రూ.79వేల నగదు, వెండి, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ నరేందర్ అరెస్ట్ చూపించి మీడియాకు ప్రకటన విడుదల చేశారు. నిందితుడిని పట్టుకున్న సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to title Podishetti Shyam, S/o: Rajaiah, Age: 32 years, Occ: Agriculture, R/o: H.No. 4-59, Akunur village V-Saidapur mandal of Karimnagar dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

In Akunur village the survey number 23/5, a vacant open place to an extent of 242.00 Square yards its equivalent to an extent of 202.31 Square meters, within the boundaries
North: GP Road
South: GP Road
East: House of Ande Sampath
West: House of Marupaka Swarupa
Is situated at Akunur village V-Saidapur mandal of Karimnagar dist.
Date: 08-04-2024

Sd/- **G. LAXMANA MURTHY,** Advocate
Huzurabad. Cell No. 94403 69866

ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి గల్లంతు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 8: కందుగుల గ్రామానికి చెందిన మాదం విజయ్(22) అనే విద్యార్థి ఈతకు వెళ్లి సోమవారం గల్లంతైనట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. విజయ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. ఉగాది సెలవులకు స్వగ్రామం కందుగులకు వచ్చిన అతడు స్నేహితులతో కలిసి ఊర చెరువు సమీపంలోని వ్యవసాయ బావిలోకి ఈతకు వెళ్లాడు. స్నేహితులు బయటికి వచ్చి చూసే సరికి విజయ్ కనిపించక పోవడంతో అతడి తండ్రి రవికి సమాచారం ఇచ్చారు. బావిలో గాలింపు చర్యలు చేపట్టారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఏప్రిల్ 8 : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించే సిసాట్-25 పరీక్షకు హాజరయ్యే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి పవన్‌కుమార్ తెలిపారు. సివిల్ సర్వీసెస్ అప్టిట్యూట్ పరీక్షలో ప్రవేశాల కోసం జిల్లాలోని ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 28న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందించే ఈ శిక్షణలో మహిళా అభ్యర్థులకు 33.33శాతం, అన్ని రిజర్వు కేటగిరీల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

ఎస్సారార్ కళాశాల పీజీ ఫలితాల విడుదల

ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, అధికారులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 8 : జిల్లా కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల 2022 -23 విద్యా సంవత్సరం నుంచి యూజీసీ అటానమస్ హోదా పొందగా, కళాశాలలో పీజీ ఒకటో, మూడో సెమిస్టర్ల పరీక్షలు మార్చి నెలలో నిర్వహించారు. ఈ క్రమంలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట రామకృష్ణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి ఆధ్వర్యంలో పరీక్షల ఫలితాలు విడుదల చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే సురేందర్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ ఈ కొమురయ్య, డాక్టర్ జీ పురుషోత్తం, అకాడమిక్ కోఆర్డినేటర్లు డాక్టర్ ప్రమోద్ కుమార్, డాక్టర్ మహేశ్, పీజీ కోర్సుల విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ, అటానమస్ కళాశాలలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తూ, సకాలంలో ఫలితాలు వెల్లడిస్తున్నట్లు తెలిపారు.

సుడా చైర్మన్‌కు సన్మానం

రాంనగర్, ఏప్రిల్ 8: కరీంనగర్ జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని సోమవారం అసోసియేషన్ కార్యాలయంలో సన్మానించారు. బిల్డర్స్ అసోసియేషన్‌కు గౌరవాధ్యక్షుడిగా నరేందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షుడు అస్తపురం నారాయణ, ప్రధాన కార్యదర్శి మేక శ్రీనివాస్, కోశాధికారి దుర్గం ప్రభాకర్, అసోసియేషన్ సభ్యులు హస్తపురం తిరుపతి, గాలి పెళ్లి తిరుపతి, ఆంజనేయులు, దుర్గం శంకర్, గంధం పరశురాం, కనకం నర్సయ్య, గోనె మల్లేశం, గాలి తిరుపతి, గాలిపెల్లి వెంకన్న పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీటీంలు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 8 : మహిళల రక్షణ కోసమే షీటీంలు ఉన్నాయని, వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీలత సూచించారు. కరీంనగర్ షీటీం బృందం సభ్యులు సోమవారం బీసీ స్టడీ సర్కిల్‌లోని అభ్యర్థులకు షీటీం పనిచేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీలత మాట్లాడుతూ, ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే షీటీంకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో జాగ్రత్తగా వ్యవహరించాలని, తద్వారా సైబర్ నేరాలను అదుపు చేయవచ్చని విద్యార్థులకు చెప్పారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు స్వప్న, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పూలే జయంత్యుత్సవ కమిటీ సభ్యులకు సన్మానం

నూతన జ్యోతిబా పూలే జయంతి కమిటీ సభ్యులను సన్మానించిన మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ దంపతులు

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 8: మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంత్యుత్సవ కమిటీ సభ్యులను హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ దంపతులు సోమవారం సన్మానించారు. సన్మానం పొందిన వారిలో కమిటీ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాస్‌పటేల్, ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజకుమార్, అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఖలీద్ హుస్సేన్, సభ్యులు తులసి లక్షణమూర్తి, ఇప్పలపల్లి చంద్రశేఖర్, జమదగ్ని, మల్లేశ్ ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలపై అవగాహన

వీణవంక, ఏప్రిల్ 8: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అవగాహన (వర్క్ షాప్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీధర్ మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ప్రభుత్వ నియమాలు పాటించి పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి కన్వీనర్‌గా పాఠశాల హెచ్ఎం ఉంటారని, గ్రామ సమైక్య సంఘం అధ్యక్షురాలు చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని ఎంఈవో విడపు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం కొమురయ్య, అన్ని ఆదర్శ పాఠశాలల చైర్‌పర్సన్‌లు (వీవో)లు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీ కాకతీయ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 8: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్‌టీఎస్‌వో) పరీక్షలో హుజూరాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య కరిక్యులం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కాకతీయ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని పాఠశాల ప్రిన్సిపాల్ మాట్ల సందీప్‌కుమార్ సోమవారం తెలిపారు. పాఠశాల విద్యార్థులు 315 మంది ఒలింపియాడ్ పరీక్షలు రాయగా, 271 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో బహుమతులు పొందారన్నారు. ఐఎన్‌టీఎస్‌వో వారు పంపించిన బహుమతులను సోమవారం ప్రిన్సిపాల్ మాట్ల సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేసి అభినందించారు.

ప్లేయాష్ లారీల పట్టివేత

శంకరపట్నం, ఏప్రిల్ 8: పరిమితికి మించి ప్లేయాష్ లోడ్‌తో వెళ్తున్న లారీలను ఆర్టీఏ అధికారులు పట్టుకున్నారు. సోమవారం రామగుండం ఎన్‌టీపీసీ నుంచి అధిక లోడ్ ప్లేయాష్‌తో సత్తుపల్లికు వెళ్తున్న ఐదు లారీలను కేశవపట్నం శివారులో పట్టుకున్నట్లు హుజూరాబాద్ ఎంవీఐ కంచి వేణు తెలిపారు. ఇక్కడ ఆర్టీఏ అధికారులు ఉన్నారు.

ఈజీఎస్ పనుల పరిశీలన

చిగురుమామిడి, ఏప్రిల్ 8 : మండలంలోని పలు గ్రామాల్లో ఈజీఎస్ పనులను ఎంపీడీవో బాసం మధుసూదన్ సోమవారం పరిశీలించారు. చిగురుమామిడి, ముల్కనూరు, సీతారాంపూర్ తదితర గ్రామాల్లో కొనసాగుతున్న పనులు పరిశీలించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు తాగునీరు, గ్లూకోస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జాబ్ కార్డులు కలిగి ఉన్న వారందరికీ పనులు కల్పించాలని సూచించారు.

కొత్తపల్లి, గంగాధర, మానకొండూర్ రూరల్ మండలాల్లో ఉగాది సంబురాలు

మానేరులో ఉగాది సంబురాల్లో చిన్నారులు

వింధ్యావాలీలో ఉగాది సంబురాల్లో విద్యార్థులు

కమాన్‌చౌరస్తా/ కొత్తపల్లి/ గంగాధర/ మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 8 : క్రోధి నామ సంవత్సర ఉగాది ముందస్తు సంబురాలను సోమవారం జిల్లావ్యాప్తంగా విద్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని తయారు చేసి, పంపిణీ చేశారు. కాగా, పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు, పాటలతో అలరించారు. పాఠశాలల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాదరావు అందరికీ ఉగాది శుభాకాంక్ష